సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. ఈ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై తమ ఛాంబర్‌లో బుధవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ఈనెల 16న ప్రారంభించి, నవంబరు 24న ముగుస్తుందని చెప్పారు. విజయనగరం డివిజన్‌లో 267 సంఘాలు, పార్వతీపురం డివిజన్(బొబ్బిలి సబ్ డివిజన్)లో 30, శ్రీకాకుళం డివిజన్ (పాలకొండ సబ్‌డివిజన్)లో 75, మడ్డువలస రిజర్వాయర్ ప్రాజెక్టు పరిధిలో 15, మొత్తం 387 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని తెలిపారు. వీటిపరిధిలో 2,628 టిసిలు ఉన్నాయని తెలిపారు. ఖచ్చితమైన ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి ఎన్నికల ప్రక్రియను పకడ్బంధీగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, సాగునీటి సంఘాల ఎన్నికల నోడల్ ఆఫీసర్, ఇరిగేషన్ ఇఇ ఎం.వెంకటరమణ, వివిధ ప్రాజెక్టుల డిఇలు పాల్గొన్నారు.

మధుర స్మృతిగా నిలిచిపోవాలి

- ఉత్సవాల ప్రారంభానికి శాసనసభ స్పీకర్ రాక
- చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి శ్రీనివాస్

విజయనగరం ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే, కలెక్టర్,ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగర ఉత్సవాలు ప్రతి ఒక్కరి మదిలో మధుర స్మృతిగా నిలిచిపోయేలా నిర్వహించాలని రాష్ట్ర ఎంఎస్ఎంఒ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉత్సవాల ఏర్పాట్ల పై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఎమ్మెల్యే అదితి గజపతి రాజు,కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తో కలసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేస్తున్న మొట్ట మొదటి కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా, వైభవంగా నిర్వహించాలని తెలిపారు. అధికారులు వారికి కేటాయించిన విధులను జాగ్రత్తగా నిర్వహించి పండగను, ఉత్సవాలను విజవంతం చేయాలనీ తెలిపారు. అనధికార సభ్యులతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి లోటు పాట్లు లేకుండా పని చేయాలన్నారు. మొత్తం ఉత్సవ కార్యక్రమాలను డాక్యుమెంటేషన్ చేయాలని, ఎక్కడైనా పొరపాట్లు జరిగినా వచ్చే ఏడాదికి వాటిని సరి దిద్దుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ర్యాలీ, క్రీడలలో పాల్గొనే వారికీ, కళాకారులకు ప్రధానంగా బయట నుండి వచ్చే వారికీ భోజనం, వసతి, తాగునీరు తదితర సౌకర్యాలను కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రారంభ ర్యాలీకి రాష్ట్ర సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు విచ్చేస్తారని తెలిపారు. 11వ తేదీ సాయంత్రానికి నగరమంతా లైటింగ్ ఏర్పాట్లు జరగాలని ఆదేశించారు.

ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ రాష్ట్ర పండుగ గా జరుపుకుంటున్న అమ్మవారి జాతరను సమిష్టి కృషితో విజయవంతం చేయాలని తెలిపారు.ఉత్సవాల ద్వారా విజయనగరాన్ని ఒక పర్యాటక ప్రాంతంగా అభివద్ధి చేయడానికి మంచి అవకాశం లభిస్తుందన్నారు. పర్యాటక ప్రాంతంగా మారితే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ అన్ని వేదికలలో ఇంచార్జ్ అధికారులు లైఫ్ మెంబెర్లతో కలసి సమన్వయం చేసుకొని ఎలాంటి లోటు పాట్లు లేకుండా పని చేయాలని తెలిపారు. జిల్లా ఎస్.పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ ఉత్సవాలకు, పండగకు 2 వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం త్సవాలకు సంబంధించిన పోస్టర్లను, కర పత్రాలను, బ్యానర్లను, టీజర్లను మంత్రిచేతుల మీదుగా ఆవిష్కరించారు. సమావేశంలో జెసి సేతు మాధవన్, డిఆర్ఒ అనిత, ఆర్‌డిఒ కీర్తి , జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కార్యక్రమాల వివరాలు

-13న అమ్మవారి గుడి నుంచి అయోధ్య మైదానం వరకు ప్రారంభోత్సవ ర్యాలీ. సాయంత్రం పెట్‌షో.
- 13, 14 తేదీల్లో రెండు రోజుల పాటు అయోధ్యా మైదానం లో మెగా ఈవెంట్‌తో పాటు జబర్దస్త్ వంటి వినోద కార్యక్రమాలు.
- కోట లో సైన్సు ఫేర్. 205 సైన్సు ప్రాజెక్టులు ప్రదర్శన.
- కోట వద్ద శ్రీ పైడి తల్లి అమ్మవారి జీవిత చరిత్ర, విజయనగర వైభవం పై లేజర్ షో ప్రదర్శన.
- గురజాడ కళాభారతి లో నాటికలు, ఏక పాత్రాభినయాలు
- విజ్జి స్టేడియంలో 5 రకాల క్రీడలు
- ఆనంద గజపతి ఆడిటోరియంలో సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు
- లేడీస్ రిక్రియేషన్ క్లబ్ లో కవి సమ్మేళనాలు, అష్టావధానాలు
- లయన్స్ క్లబ్ లో జానపద కళారూపాలు, బొంకుల దిబ్బ వద్ద 13న సత్య హరిశ్చంద్ర, 14న కన్యాశుల్కం నాటకాల ప్రదర్శన, పులి వేషాలు.
- లోయర్ ట్యాంక్ బండ్ దగ్గర 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన సరస్ , అదే వేదిక వద్ద పుష్ప ఫల ప్రదర్శన.

గతం కంటే భిన్నంగా సరస్

ప్రజాశక్తి-విజయనగరం కోట

- 11న డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన ప్రారంభం
- 18 రాష్ట్రాల నుంచి 250 స్టాళ్లు ఏర్పాటు
- గతం కంటే అమ్మకాలు పెరుగుతాయి
- 'ప్రజాశక్తి'తో డిఆర్‌డిఎ పీడీ కల్యాణ్‌చక్రవర్తి

విజయనగరం ఉత్సవాలు, పైడితల్లమ్మ పండ నేపథ్యంలో ఈనెల 11న ట్యాంక్‌బండ్ రోడ్డులో ఏర్పాటు చేస్తున్న సరస్ (డ్వాక్రా బజారు)ను గత ఏడాది కంటే విభిన్నంగా నిర్వహించబోతున్నట్లు డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణ్‌చక్రవర్తి తెలిపారు. 18 రాష్ట్రాల నుంచి వివిధ రకాలైన ఉత్పత్తులతో 250 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలన్నింటికి ఒక ప్లాట్ ఫామ్ ఏర్పాటు చేసి, దీనిద్వారా వారి ఉత్పత్తులను విక్రయించేందుకు అవకాశాలు కల్పించడమే ఈ సరస్ ముఖ్య ఉద్దేశమని అన్నారు. సరస్ ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను బుధవారం ప్రజాశక్తికి తెలిపారు.

గత ఏడాది విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సరస్ తక్కువ సమయంలోనైన ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని అన్నారు ఈ ఏడాది ఏర్పాటు చేస్తున్న సరస్ ముందుగా ప్రారంభం కావడంతో గతం కంటే ఎక్కువగా ప్రజల ఆదరణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ సరస్‌లో దేశంలో సుమారు 18 రాష్ట్రాల నుంచి వివిధ డ్వాక్రా, మహిళా సంఘాలు ఉత్పత్తులను ఈ స్టాల్స్‌లో ఏర్పాటు చేయనున్నారని చెప్పారు. మన రాష్ట్రంతోపాటు తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, గోవా, గుజరాత్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, ఒడిశా, కేరళ , తమిళనాడు , బీహార్ వివిధ రాష్ట్రాల నుంచి ఈ స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.
18 రాష్ట్రాల నుంచి 70 స్టాల్స్, మన రాష్ట్రంలో 26 జిల్లాల నుంచి 90, మెప్మా ద్వారా 70, నాబార్డ్ ద్వారా 30 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీరితోపాటు బయట వ్యాపారస్తులు కూడా అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ స్టాల్స్ లో చేతువత్తులు కర్రతో చేసిన చెక్క బొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని అన్నారు. సిల్క్ ,కాటన్ సంబంధించిన వివిధ రకాలైన వస్త్ర ఉత్పత్తులు, వివిధ రకాల పిండివంటలు, పచ్చళ్లు కూడా ఉంటాయని తెలిపారు.

ప్రత్యేక ఆకర్షణగా ఫ్లవర్‌షో

ఈసారి ఉత్సవాల్లో భాగంగా ఫ్లవర్ షో ను ఇక్కడే ప్రత్యేక ఆకర్షణతో ఏర్పాటు చేస్తున్నట్లు కల్యాణచక్రవర్తి తెలిపారు. వివిధ రాష్ట్రాల్లోని పలు జాతుల పుష్పాలను తీసుకువస్తున్నట్లు తెలిపారు. దీంతోపాటు ఈసారి ప్రత్యేక ఆకర్షణగా విజయనగరం కోట గోడపై లేజర్ షో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ లేజర్ షోలో విజయనగరం పైడితల్లమ్మ చరిత్ర ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు.

వీరికి మహిళా ప్రాంగణంలో వసతితో పాటు భోజన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అక్కడి నుంచి ట్రాన్స్‌పోర్టు సౌకర్యం కూడా ఉంటుందన్నారు. గత ఏడాది డ్వాక్రా బజారులో రూ.6 కోట్ల అమ్మకాలు జరిగితే ఈసారి రూ.9 కోట్లు వరకు జరిగే అవకాశం ఉందని అన్నారు. దీనికి సంబంధించి నేషనల్ రూరల్ లైవ్ హుడ్ మెషినరీ రూరల్ డెవలప్మెంట్, నాబార్డు, యుబిఐ, శ్రీనిధి, ఎస్ఐ డిబిఐ, డిసిసిబి, కార్పొరేషన్ బ్యాంక్, కాబ్, ఎస్‌బిఐ, కెనరా బ్యాంక్ వంటి పలు బ్యాంకుల సహకారంతో ముందుకు వెళు న్నట్లు తెలిపారు. ఒక్కొక్క స్టాల్‌కు ఇద్దరికి చొప్పున పర్మిషన్ ఇచ్చామన్నారు.

డ్వాక్రా బజారు వద్ద పది రోజులు పాటు సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 9గంటలు వరకు సాంస్కతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు ఢీకొనడంతో మృతి చెందిన గొర్రెలు

రైలు ఢీకొని 40 గొర్రెలు మృతి

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని చింతలపాలెం సమీపంలో గల రైల్వే ట్రాక్ వద్ద రైలు ఢీ కొని ప్రమాదవసాత్తు సుమారు 40 గొర్రెలు మృతి చెందాయి. మంగళవారం అర్ధరాత్రి చింతలపాలెం గ్రామానికి చెందిన రైతులు మురుగుటి కృష్ణ, రాజు, గణేష్‌లకు చెందిన గొర్రెల మందను మేపేందుకు తీసుకెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం సంభవించిందని రైతులు బోరున విలపించారు. దశరా పండుగ సమయంలో ఇటువంటి ఘోరమైన సంఘటన చోటుచేసుకోవడంతో ఆ కుటుంభం తీవ్ర విషాదాన్ని చవిచూసింది. సుమారు రూ.5లక్షల వరకూ ఆస్తినష్టం వాటిల్లిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. గ్రామ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు మాకెన సీతారామపాత్రుడు (నవీన్), పలువురు గ్రామ పెద్దలు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి సర్పంచ్ నవీన్ పరిస్థితిని ఫోన్లో వివరించగా ఆమె స్పందించారు. ప్రభుత్వం ఆదుకుటుందని, అధైర్యపడొద్దని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

గంజాయి కేసులో 8 మంది అరెస్టు

నెల్లిమర్ల : మండలంలోని నెల్లిమర్ల చంపావతి నది పరివాహక ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న, సేవిస్తున్న 8 మంది నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి 8 కిలోల గంజాయి, 2 మోటారు సైకిళ్ళు, 7 సెల్ ఫోన్లను పోలీసులు సీజ్ చేసి, నిందితులను రిమాండుకు తరలించినట్లు ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. అనకాపల్లి జిల్లా చోడవరం గ్రామానికి చెందిన సురభి పార్ధసారధి, జ్యోతుల బద్రినాధ్, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు చెందిన కొర్ర భాస్కరరావుతో కలిసి చంపావతి నదివద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు వారితో పాటు కృష్ణా జిల్లా కానుమూరుకు చెందిన గుంటూరు తేజ నెల్లిమర్ల మండలం దివకులపేటకు చెందిన కె.గణేష్, విశాఖకు చెందిన డొప్ప అనుదీప్ సామిరెడ్డి రఘు చరణ్ ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

పార్టీ కోసం పని చేసేవారికి సముచిత స్థానం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్‌పి కలిశెట్టి, ఎమ్మెల్యేలు
- అట్టహాసంగా మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు సన్మానసభ
- భారీ ర్యాలీకి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు



కర్రోతు బంగార్రాజును సన్మానిస్తున్న మంత్రి, ఎంపిలు, ఎమ్మెల్యేలు, నాయకులు

ప్రజాశక్తి-డెంకాడ

టిడిపిలో కష్టపడి పనిచేసే వారికి సమచిత స్థానం ఉంటుందని రాష్ట్ర చిన్న మధ్య తరహా పరిశ్రమలశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, పలువురు ఎమ్మెల్యేలు అన్నారు. టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్చార్జి కర్రోతు బంగార్రాజు మార్క్ ఫెడ్ చైర్మన్‌గా పదవి బాధ్యతలు చేపట్టి నియోజకవర్గానికి వచ్చిన సందర్భంగా బుధవారం నాతవలస టోల్‌గేట్ సమీపాన ప్రకృతి లేఔట్‌లో సన్మాన సభ జరిగింది. ఆయనకు రాజాపులోవ వద్ద నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీతో స్వాగతం పలికారు. ర్యాలీ రాజాపులోవ నుంచి మోదవలస, జొన్నాడ, విజయనగరం ఎత్తి బ్రిడ్జి మీదుగా కాంప్లెక్స్ కోట దాసన్నపేట, డెంకాడ, నాతవలస మీదుగా సభాస్థలికి చేరుకుంది. అనంతరం జరిగిన సన్మాన సభలో మంత్రితో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ పార్టీ కోసం క్షేత్రస్థాయిలో కష్టపడిన కార్యకర్త నుంచి నాయకుడు వరకు పార్టీ గుర్తింపు ఉంటుందని, దానికి నిదర్శనమే కర్రోతు బంగార్రాజుకు మార్క్‌ఫెడ్ చైర్మన్ పదవి అని అన్నారు. బంగార్రాజు పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కష్టపడ్డారని, ఎమ్మెల్యే టికెట్‌ను కూడా త్యాగం చేశారని దాని ప్రతిఫలంగానే రాష్ట్ర చైర్మన్ పదవిని ముఖ్యమంత్రి ఇచ్చారని అన్నారు. ఇలా పార్టీ కోసం పని చేసిన వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని నాయకులు, కార్యకర్తలు గుర్తించుకోవాలని కోరారు. మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనపై నమ్మకముతో కట్టబెట్టిన ఈ పదవికి న్యాయం చేస్తానని తెలిపారు అనంతరం బంగార్రాజును మంత్రి శ్రీనివాస్‌తో పాటు ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, శ్రీకాకుళం, ఎచ్చెర్ల ఎమ్మెల్యేలు గొండు శంకర్రావు, ఎన్.ఈశ్వరరావు, విశాఖ ఎంపి భరత్, విజయనగరం, విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు కిమిడి నాగార్జున, గండి బాబ్జి, మాజీ ఎమ్మెల్యే పతి వాడ నారాయణస్వామి నాయుడు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు పతివాడ అప్పల నారాయణ, మండల పార్టీ అధ్యక్షులు పల్లె భాస్కరరావు, కర్రోతు సత్యనారాయణ, మహంతి శంకర్రావు, కడగల ఆనంద్ కుమార్, నాయకులు మహంతి సినిమా నాయుడు, పతవాడ తమ్మి నాయుడు, సువ్వాడ రవి శేఖర్, గేదెల రాజారావు, లంక అప్పలనాయుడు, జనసేన నాయకులు చనమల్ల వెంకటరమణ మాజీ జెడ్‌పిటిసి కంది సూర్యనారాయణ, పతివాడ శ్రీనివాసరావు, టిడిపి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగార్రాజుకు గజమాల వేస్తున్న టిడిపి కార్యకర్తలు

ప్రజల సహకారంతోనే ఘనంగా జాతర

ఎమ్‌పి అప్పలనాయుడు

ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరణ



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజల సూచనలు, సలహాలతో ఈనెల 13, 14, 15 తేదీల్లో నిర్వహించనున్న విజయనగరం ఉత్సవాలు, పైడితలమ్మ జాతర మరింత ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ మీటింగ్ హాల్లో డయల్ యువర్ ఎంపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి 30మంది తమ సూచనలను, సలహాలను ఎంపి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపి మీడియాతో మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన సూచనలు సలహాలను పరిగణలోకి తీసుకుని పైడితల్లమ్మ సిరిమానోత్సవం ఘనంగా నిర్వహిస్తామన్నారు. ప్రజలనుంచి వచ్చిన సూచనలు సలహాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య, సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, పైడితల్లమ్మ దేవస్థానం ఇఒ ప్రసాదరావు పాల్గొన్నారు.

రోడ్డు వేయకపోతే ఎంపిడిఒ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి - వేపాడ

నిరసన తెలుపుతున్న గిరిజనులు

మండలంలోని మారిక రోడ్డు నిర్మించాలని గత కొన్ని సంవత్సరాలగా ఆందోళన నిర్వహించినా అధికారుల్లో చలనం లేకపోవడంతో గిరిజనులతో కలిసి ఎంపిడిఒ కార్యాల యాన్ని ముట్టడిస్తామని సిపిఎం నాయకులు చల్లా జగన్ అన్నారు. బుధవారం మారిక గ్రామాల్లో ఆయన పర్యటించి అక్కడే ఆందోళన నిర్వహిచారు. గిరిజనుల రహదారి కష్టాలను, భూసమస్యలను విద్య, వైద్యం వంటి సమస్యలను అడిగి తెలుసుకొని అన్నంటికి అసలు సమస్య రోడ్డేనని రోడ్డు నిర్మాణం తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. 20 రోజులలో పనులు ప్రారంభించకపోతే ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి అప్పారావు, గెమ్మెల బాబురావు, కార్యకర్తలు అప్పలనాయుడు, అర్జున్, ఆనంద్, వెంకరావు, శ్రీను, కృష్ణలతోపాటు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బొబ్బిలిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న సిఐ చిన్నంనాయుడు

మద్యం షాపులకు దరఖాస్తు గడువు పెంపు

- 11వరకు స్వీకరణ.. 14న లాటరీ
- ఒక్కరోజే వేల దరఖాస్తులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు స్వీకరించేందుకు మరో రెండు రోజులు గడువు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం ఈనెల 11వ తేదీ రాత్రి 7గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం 11న తీయాల్సిన లాటరీ 14వ తేదీన తీయనున్నారు. 12,13తేదీల్లో దరఖాస్తుల పరిశీలించనున్నారు. ముందస్తు షెడ్యూల్ ప్రకారం బుధవారం నాటికి విజయనగరం జిల్లాలో 3,672, పార్వతీపురం జిల్లాలో 905 దరఖాస్తులు అందాయి. మరో రెండు రోజులు గడువు పెంచిన నేపథ్యంలో దరఖాస్తుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం కూడా ఆదాయమే లక్ష్యంగా గడువు తేదీ పెంచినట్టు చర్చనడుస్తోంది. బుధవారం ఒక్కరోజే విజయనగరం జిల్లాలో 1073, పార్వతీపురం మన్యం జిల్లాలో 329 చొప్పున దరఖాస్తులు అందడం గమనార్హం. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు కలిపి ఇప్పటి వరకు 4,577 దరఖాస్తులు అందాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.2లక్షల చొప్పున దరఖాస్తు ఫీజు రూపంలో ప్రభుత్వానికి రూ.45.15కోట్ల మేర ఇప్పటివరకు ఆదాయం వచ్చింది. దరఖాస్తు దారుల్లో ఎక్కువ మంది రాజకీయ నాయకులకు చెందిన బినామీలు, ఇప్పటికే మద్యం వ్యాపారంలో అనుభవం ఉన్న వారే ఉన్నట్టుగా తెలుస్తోంది.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

ఎంఎస్ఎంఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఘోషా ఆస్పత్రిలో అన్న క్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

సంక్షేమంతో పాటు అభివృద్ధికి తమ ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తూ ముందుకు వెళ్తోందని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక ఘోషా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను మంత్రి శ్రీనివాస్, ఎంఎల్‌ఎ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ అవసరమైన చోట కొత్తగా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఘోషాసుపత్రిలోని భవనాన్ని సుమారు రూ.35లక్షలతో ఆధునీకరించి అన్నక్యాంటీన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఘోషాసుపత్రిలో రోగుల సహాయకులకు, పనిచేసే వారికి ఈ క్యాంటీన్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. గత ప్రభుత్వం ఆసుపత్రి అభివృద్ధిపై దృష్టి పెట్టకపోగా, నిర్వహణకు కూడా నిధులను విడుదల చేయలేదని అన్నారు. సోలార్ హీటర్ ప్లాంటును మూలకు చేర్చిందని చెప్పారు. ఘోషా ఆసుపత్రిని అభివద్ధి చేయడంతోపాటు విస్తరించడానికి కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు.

ఎంఎల్‌ఎ అదితి విజయలక్ష్మి మాట్లాడుతూ, పట్టణంలో మూడవ అన్న క్యాంటీన్‌ను ప్రారంభించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. అన్న క్యాంటీన్ ద్వారా అతితక్కువ ధరకే నాణ్యమైన భోజనాన్ని అందజేస్తున్నామని, ఇది ఆసుపత్రికి వచ్చే రోగి సహాయకులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అన్నక్యాంటీన్ల నిర్వహణకు ప్రతీఒక్కరూ తమవంతు సహకారాన్ని అందించాలని కోరారు. తమ మాతృమూర్తి, విజయనగరం మున్సిపాల్టీ తొలి ఛైర్‌పర్సన్ సునీలా గజపతిరాజు తరపున అన్నక్యాంటీన్ల నిర్వహణకు లక్ష రూపాయల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు, జనసేన నాయకులు పాలవలస యశస్విని, రాజేష్ బాబు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు , పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, వేచలపు శ్రీనివాసరావు, నాయకులు కనకల మురళీమోహన్, అవనాపు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆహారాన్ని వడ్డిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, అశోక్

లక్ష్య సాధనకు కృషిచేయాలి

ఎన్‌సిసి క్యాడెట్ల శిక్షణ శిబిరంలో ఎన్‌సిసి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వి.ఎం.రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎన్‌సిసి క్యాడెట్‌ల లక్ష్యాన్ని పెట్టుకొని దాన్ని సాధించేందుకు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎయిర్ కమోడోర్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సిసి డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వి.ఎం. రెడ్డి సూచించారు. స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాల పరిధిలో జరుగుతున్న కంబైండ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ పది రోజుల క్యాంపులో జరుగుతున్న డ్రిల్, ఆయుధ శిక్షణ, మ్యాప్ పఠనం, ప్రథమ చికిత్స, ట్రెక్కింగ్, సమాజ సేవ వంటి కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఎన్‌సిసి క్యాడెట్‌లను ఉద్దేశించి మాట్లాడుతూ లక్ష్యసాధన కోసం కృషి చేయడం ఎంత ముఖ్యమో ఆయన వివరించారు. భారతదేశ సైన్యంలో చేరాలనుకునే యువతకు అవసరమైన అర్హతలు, శిక్షణ తదితర వాటిపై మార్గదర్శకం చేశారు. కార్యక్రమంలో సత్య విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ్ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామ్మూర్తి, క్యాంప్ కమాండెంట్ తపస్ మండల్, డిప్యూటీ కమాండెంట్ పల్లవి వర్మ, సుబేదార్ మేజర్ అనిల్, అసోసియేట్ ఎన్‌సిసి అధికారులు శ్రీనివాసరావు, కెప్టెన్ సత్యవేణి, లెఫ్టినెంట్ కృష్ణ కిషోర్, లెఫ్టినెంట్ దినేష్, లెఫ్టినెంట్ లక్ష్మి, లెఫ్టినెంట్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమానికి హాజరైన ఎన్‌సిసి క్యాడెట్లు

ప్రణాళికతోనే పంచాయతీల అభివృద్ధి

ప్రజాశక్తి - గుర్ల

ప్రణాళికతోనే పంచాయతీల అభివృద్ధి సాధ్యమని పంచాయతీల అభివృద్ధికి తగిన ప్రణాళికలు సిద్ధం చేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఎంపిపి పొట్నూరు ప్రమీల అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉప సర్పంచులకు, వార్డు మెంబర్లకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీల నిర్వహణలో ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు, కార్యదర్శులు పరస్పర అవగాహనతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్లు నిర్వహణ తదితర అంశాలపై మరింత అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్‌పిటిసి శీర అప్పల నాయుడు, సూపరింటెండెంట్ వరప్రసాద్, పంచాయతీ విస్తరణాధికారి అన్నపూర్ణ దేవి, కార్యదర్శులు పాల్గొన్నారు.

గుర్ల: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిపి ప్రమీల

బొబ్బిలిరూరల్: ప్రభుత్వ పథకాలపై గ్రామస్థాయి ప్రజాప్రతినిధులకు అవగాహన ఉండాలని ఎంపిడిఒ రవికుమార్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పంచాయతీ నిధులు ఏయే కార్యక్రమాలకు వినియోగించాలో తెలియజేశారు. ఇఒపిఆర్‌డి భాస్కరరావు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య, వీధి దీపాల నిర్వహణ గూర్చి అవగాహన కల్పించారు. వెలుగు ఎపిఎం భాగ్యలక్ష్మి బ్యాంకు లింకేజీలు, స్త్రీనిధి రుణాలు, పిఎంఇజిపి, ఆయుష్మాన్ తదితర పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఒ అప్పారావు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు, వార్డు సభ్యులు భాగస్వాములు కావాలని ఎంపిపి అంబళ్ల సుధారాణి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన రెండ్రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి సుధారాణి మాట్లాడుతూ ఆయా గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు, వార్డు సభ్యులు భాగస్వామ్యం కావాలని సూచించారు. గ్రామాల్లో అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుని, అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రామకృష్ణరాజు, ఇఒపిఆర్‌డి శంకర్ జగన్నాథం పాల్గొన్నారు.

డెంకాడ: ప్రభుత్వం పంచాయతీ సభ్యులకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను సభ్యులందరూ వినియోగించుకోవాలని ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వార్డు మెంబర్లు, ఉప సర్పంచులకు బుధవారం శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే వార్డు మెంబర్లే కీలకమన్నారు. వారి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను వినియోగించుకోవాలన్నారు. పెద్ద తాడివాడ పంచాయతీ కార్యదర్శి చింతపల్లి అప్పలనాయుడు, పినతాడివాడ కార్యదర్శి వెంకట్రావు, గంట్లాం కార్యదర్శి లక్ష్మణరావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వై.భవాని, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి పనులు సక్రమంగా జరిగే విధంగా చూసే బాధ్యత వార్డు మెంబర్లపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, ఇఒపిఆర్‌డి రవికుమార్ పాల్గొన్నారు.

వేపాడ తహశీల్దార్‌గా రాములమ్మ

ప్రజాశక్తి - వేపాడ

తహశీల్దార్‌గా బుధవారం జె. రాములమ్మ బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో సీతానగరంలో పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆమె మాట్లాడుతూ రైతులు భూ సమస్యలపై వస్తే వారికి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామన్నారు.

ఇఒపిఆర్‌డిగా రవికుమార్

మండల ఇఒపిఆర్‌డిగా ఎస్ రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు ఇక్కడ ఇఒపిఆర్‌డిగా పనిచేసిన జి ఉమా జామి బదిలీ కావడంతో ఆమె స్థానంలో కొమరాడలో పనిచేసిన రవికుమార్ వచి బాధ్యతలు స్వీకరించారు.

జామి ఇఒపిఆర్‌డిగా ఉమాదేవి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - జామి

మండల నూతన ఇఒపిఆర్‌డిగా జి.ఉమాదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన శ్రీదేవి కొత్తవలస బదిలీ కాగా, వేపాడలో పని చేస్తున్న ఉమాదేవి జామికి బదిలీపై వచ్చారు. ఇఒపిఆర్‌డిగా ఉన్నవారే, జామి మేజర్ పంచాయతీ ఇఒగా అదనపు బాధ్యతలు చూడాల్సి ఉంటుంది.

ట్రాన్స్‌జెండర్లకు న్యాయ అవగాహన సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థలో ట్రాన్స్ జెండర్స్, కమ్యూనిటీ మెంబర్స్‌కు న్యాయ అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. సదస్సులో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కె.విజయ కళ్యాణి మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్ హక్కులు, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, పథకాలు గురించి వివరించారు. ట్రాన్స్ జెండర్‌కు కూడా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలియజేశారు. కమ్యూనిటీ మెంబర్స్ హక్కులు, వారికి ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి తెలిపారు. కార్యక్రమంలో పర్మినెంట్ లోక్ అదాలత్ అధ్యక్షులు జి.దుర్గయ్య మాట్లాడుతూ మానవ హక్కులు, మానవుల అక్రమ రవాణా బాధితుల గురించి తెలిపారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమశాఖ ఎడి జి.జగదీష్, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ ఉమామహేశ్వరరావు, ఎన్‌జిఒ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కరువు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని జై భీంరావు భారత్ పార్టీ నాయకులు బి.సరసయ్య, కె. శ్రీనివాస రావు ఆరోపించారు. బుధవారం వారు నెల్లిమర్లలో విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో దళిత మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో దళిత బాలికపై టిడిపి నేత అత్యాచారం చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వరుసగా రాష్ట్రంలో హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. డిప్యూటీ సిఎం నియోజకవర్గంలో ఇలాంటి సంఘటన జరగడం దురదృష్టకరమని ఈ ఘటనలో కఠిన చర్యలు తీసుకొని నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

పన్నుల వసూళ్ల ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ అప్పలరాజు

పన్నులు శతశాతం వసూలు కావాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో శతశాతం పన్ను వసూళ్లు జరగాలని కమిషనర్ కె.అప్పలరాజు అన్నారు. బుధవారం ఆయన నగర పంచాయతీ 2, 3, 7 సచివాలయాల్లో జరుగుతున్న పన్నుల వసూళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి, నీటి, ఇంటి పన్ను త్వరితగతిన చెల్లించి నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. శతశాతం పన్నుల వసూళ్లకు సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ డి. ఉమా భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - గరివిడి

మండలంలో చుక్కవలస ఎంపియుపి స్కూల్లో పనిచేస్తున్న బి.రాజశేఖర్ అనే ఉపాధ్యాయుని బంధువులు పాఠశాలకు కొంత విరాళాన్ని అందించారు. ఆ మొత్తంతో డాక్టర్ అబ్దుల్ కలాం, నెహ్రూ, సావిత్రిబాయి పూలే, అంబేద్కర్ విగ్రహాలను కొని బుధవారం ఉదయం పాఠశాలలో ఆవిష్కరించారు. సర్పంచ్ అన్నంనాయుడు, మాజీ సర్పంచ్ బోడి నాయుడు, మాజీ సర్పంచ్ కె. వెంకట రమణ, ఎంఇఒ రామారావు, అప్పన్న ఎస్ఎంసి చైర్మన్ శపతి జగన్నాథం విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు సత్య శ్రీనివాస్, సూరి, శ్రీను, బంగార్రాజు, పూర్వ ఉపాధ్యాయులు పాపినాయుడు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా నట్టల నివారణ మందులు

ప్రజాశక్తి - డెంకాడ

మండలంలో గొర్రెలు మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు వేస్తున్నామని మండల పశువర్ధక శాఖ అధికారి ఎం శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో గురువారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు ప్రతి గ్రామంలో గొర్రెల మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు వేస్తామన్నారు. గొర్రెల మేకల పెంపకం దారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రెడ్డికంచేరులో కాన్షీరామ్ 18వ వర్ధంతి

ప్రజాశక్తి - భోగాపురం

బహుజన సమాజ్ పార్టీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు కన్షీ రామ్ 18వ వర్ధంతిని రెడ్డి కంచెరు గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గం అధ్యక్షులు ఎడకొండ వెంకటరావు కన్షీరామ్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. వెంకటరావు మాట్లాడుతూ కన్షీరామ్ అంబేద్కర్ సూచించిన మార్గంలో బహుజన రాజ్యాధికారస్థాపన కోసం ఉద్యోగాన్ని బలిదానాన్ని విడిచి బహుజన సమాజ్ పార్టీని స్థాపించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బోగాపురం మండల బిఎస్పీ కన్వీనర్ చందాల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బాలల వేషధారణ

ప్రజాశక్తి - బొబ్బిలి

పాతబొబ్బిలిలో దసరా సందర్భంగా యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల వేషధారణ ఆకట్టుకుంది. వివిధ జంతువులు, పక్షుల వేషధారణను ధరించిన చిన్నారులు వీధులలో పర్యటించి ప్రజలను ఆకట్టుకున్నారు. జంతువులు, పక్షులు హావభావాలను ప్రదర్శించారు. బాలలలో ప్రతిభను గుర్తించేందుకు ప్రదర్శన నిర్వహించినట్లు యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షులు ఎం.వేణుమోహన్ అన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

పట్టణంలోని 110 ఏళ్ల చరిత్ర కలిగిన సిబిఎం పాఠశాల స్థలం అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని సిపిఐ జిల్లా నాయకులు కోట అప్పన్న, ఎఐఎస్ఎఫ్ నాయకులు శ్రావణ్ కుమార్, ఎంఆర్‌పిఎస్ నాయకులు సునీల్ డిమాండ్ చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు కోరుతూ బుధవారం ఆర్‌డిఒ రామ్మోహనరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్న సిబిఎం బాలికోన్నత పాఠశాల స్థలాన్ని నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయడం అన్యాయమన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన వారిపైన, చేయించుకున్న వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు అవినీతితో అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి పాఠశాలను కొనసాగించాలని కోరారు.

గంజాయి రవాణా నియంత్రణకు చర్యలు

విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్

ప్రజాశక్తి-విజయనగరం కోట

గంజాయి నియంత్రణలో భాగంగా డైనమిక్ వెహికల్ చెకింగ్స్ ఆకస్మికంగా చేపట్టాలని విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ ఎస్‌పిలను ఆదేశించారు. బాణసంచా దుకాణదారులు, గోడౌన్లు వద్ద భద్రత ప్రమాణాలను పర్యవేక్షించాలని సూచించారు. విశాఖ రేంజ్ పరిధిలోని అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎస్‌పిలతో బుధవారం విశాఖ నుంచి జూమ్ మీటింగు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ రేంజ్ పరిధిలో ఎక్కడ గంజాయి సాగు జరగకుండా చూడాలని, గంజాయి పండించే రైతులు తమ జీవనోపాధికి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రజలు, విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు 'సంకల్పం' కార్యక్రమం ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతీ జిల్లాలో గంజాయి అక్రమ రవాణ నియంత్రణకు మరింత పటిష్టంగా డైనమిక్ వాహన తనిఖీలను ఆకస్మికంగా చేపట్టాలన్నారు. గంజాయి అక్రమ రవాణకు తరుచూ పాల్పడే వారిపై పీడీ యాక్టును ప్రయోగించాలన్నారు. గంజాయి కేసుల్లో పరారీలో ఉన్న నిందితులను అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలను నియమించాలని ఆదేశించారు. దీపావళి పండగ వస్తున్న నేపథ్యంలో బాణసంచా విక్రయించే షాపులు, గోడౌన్లను తనిఖీ చేసి, వారి లైసెన్సులు తనిఖీ చేయాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. పేకాట స్థావరాలను గుర్తించేందుకు నిఘా పెట్టాలని ఆదేశించారు. ప్రతీ జిల్లాలోను క్రైం ప్రోన్ ఏరియాలను గుర్తించి, సిసి కెమెరాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. సైబరు మోసానికి గురైతే 1930కు ఫిర్యాదు చేసే విధంగా చూడాలని తెలిపారు. కాన్ఫరెన్సులో అనకాపల్లి జిల్లా ఎస్‌పి ఎం. దీపిక, ఎఎస్ఆర్ జిల్లా ఎస్‌పి అమిత్ బర్కర్, విజయనగరం జిల్లా ఎస్‌పి వకుల్ జిందల్, శ్రీకాకుళం ఎస్‌పి కెవి మహేశ్వర రెడ్డి, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్‌పి ఎస్.వి.మాధవ్ రెడ్డి పాల్గొన్నారు.

అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సోమేశ్వరరావు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల పనితీరుపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం కింద పనులు సక్రమంగా జరగడంలేదని 100 రోజుల పని దినాలు పూర్తి శాతం అయ్యేవిధంగా చూడాలని ఎపిఒ తిరుపతిని ఎంపిపి కోరారు. వెలుగు ద్వారా గ్రామాల్లో మహిళ సంఘాల వారికి సేవలం దించే విఒఎలను సక్రమంగా పనిచేసే విధంగా చూడాలని, వ్యవసాయ శాఖ అధికారి, పంచాయ తీరాజ్ ఎఇ సత్యనారాయణ వారి శాఖల ద్వారా జరిగిన అభివృద్ధిని వివరించారు. ఎపిఎస్ ఆర్టీసీ, ఎండోమెంట్, ఎలక్ట్రికల్ ఎఇ వారి శాఖల నుంచి సమావేశానికి ఏ ఒక్కరు హాజరు కాకపోవడం విశేషం. సర్వసభ్య సమావేశంలో పోలీసు, అటవీ, ఇరిగేషన్, హెల్త్, ఎడ్యుకేషన్, రోడ్లు భవనాల శాఖ వచ్చినప్పటికీ ఏ ఒక్క అధికారికి సంబంధించిన రిపోర్టులు సర్వసభ సమావే శంలో ప్రస్తావించలేదు. సమావేసానికి లేటుగా హాజరైన బొడ్డవర పిహెచ్‌సి అధికారిని శిరీషను ఎంపిపి సోమేశ్వరరావు సమయపాలన పాటిం చాలంటూ హెచ్చరించారు. సమాసం ఏర్పాటైన కొద్దిసేపట్లోనే కొంతమంది సర్పంచులు నెమ్మదిగా సమావేశం నుంచి జారుకున్నారు. మండలంలో ఇసుక రీచ్‌లు అధికారకంగా లేవని ఏ ఒక్క వ్యక్తి కూడా నదులలో నుండి ఇసుక తరలించి వ్యాపారం చేయరాదని, అలా చేసిన వారిపై ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైస్ ఎంపిపి సుధా రాణి మాట్లాడుతూ మండలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూదాందాలు చేస్తున్నారని ప్రభుత్వ భూములు, చెరువులు కాజేస్తున్నారని వాటిపై పూర్తిస్థాయిలో నివేదిక సమర్పించాలని ప్రభుత్వం భూములు రక్షించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ, జెడ్‌పిటిసి వెంకటలక్ష్మి, వివిధ శాఖల మండల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం

ప్రజాశక్తి- బాడంగి

మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని బొబ్బిలి డిఎస్‌పి పి. శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను బుధవారం ఆయన వార్షిక తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. మత్తు పదార్థాలపై సంకల్పం ప్రోగ్రాం ద్వారా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. సైబర్ నేరాలు, రహదారి ప్రమాదాలపై కూడా చైతన్య పరుస్తున్నామన్నారు. బొబ్బిలి సబ్ డివిజన్‌లో బొబ్బిలి, కొట్టక్కి, పిట్టాడలో శాశ్వత చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా విజిబుల్ పోలీసింగ్ ఏర్పాటు చేశామన్నారు. పోలీస్ స్టేషన్‌కి వచ్చిన వారికి మంచి సేవలు అందించాలని, ఏదైనా ఫిర్యాదు వస్తే వాటిని సకాలంలో కేసు నమోదు చెయ్యాలని లేదంటే ఫిర్యాదు సమస్య రాజీ మార్గంలో పరిష్కరించాలని తెలిపారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో మందుగుండు సామాగ్రి కాల్చకుండా, అశ్లీలత ప్రదర్శన కార్యక్రమాలు చేపట్టరాదని చెప్పారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. మందుగుండు సామాగ్రి తయారీ శిబిరాన్ని బాడింగి ఎస్‌ఐతో పాటు కలిసి తనిఖీ చేసి, వారికి కూడా భద్రత పై సూచనలు సలహాలు ఇచ్చారు. డిఎస్‌పితో పాటు రూరల్ సీ.ఐ. నారాయణరావు, ఎస్ఐ తారకేశ్వరరావు ఉన్నారు.

తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - జామి

మండల కేంద్రంలో రైతులకు వ్యవసాయాధికారులు బుధవారం వరిలో తెగుళ్లపై అవగాహన కల్పించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా జామిలో ఎఒ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పంట పొలాలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. వరి పంటకు ఆశిస్తున్నా పొడతెగులు, దోమ పోటుకూ నివారణ చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి బండారు పెదబాబు, వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్. విజయ, ప్రాథమిక పరపతి సంఘం మాజీ ప్రెసిడెంట్ స్వామి నాయుడు, వ్యవసాయ సహాయకులు అలేఖ్య, ఉష, నైరా వ్యవసాయ కళాశాల, నైరా విద్యార్థులు, రైతులు, పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని అక్కివరం, గొలగాం రైతు సేవ కేంద్రాల పరిధిలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎఒ నిర్మల మాట్లాడుతూ వరి పంట చిరు పొట్ట నుండి పాలు పోసుకునే దశలో ఉందిని ఈ నేపథ్యంలో ఎకరాకు 20కిలోల యూరియా 25కిలోల పొటాష్ ఎరువును వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అక్కివరం సర్పంచ్ కంది కిరణ్ కుమార్, ఉప సర్పంచ్ కంది సత్యనారాయణ, గొలగాం ఉప సర్పంచ్ లెంక అచ్చింనాయుడు, గొలగాం గ్రామ పెద్దలు కంది గంగాధర్ రావు, అక్కివరం ఆదర్శ రైతు కంది శ్రీను, రైతులు పాల్గొన్నారు.

వేపాడ: మండల సమైక్యలో రెండో రోజు బుధవారం జరిగిన ఈసీ సభ్యుల శిక్షణా కార్యక్రమానికి ఆర్‌టిఎల్ ప్రకాష్ హాజరై మాట్లాడారు. అనంతరం కెఆర్‌పేట గ్రామంలో దుంగల దేముడు వేసిన ఎటిఎం మోడల్, రాయుడుపేట గ్రామంలో ఎఫ్ఎస్ (ఫార్మర్ సైంటిస్ట్), కర్రీ వసంత వేసిన ఏటీఎం మోడల్‌ను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

సేవల వారధి భారతీయ తపాలా

ప్రజాశక్తి- బొబ్బిలి

పోస్టుమ్యాన్‌లను సత్కరిస్తున్న జెసి రాజు

జన జీవన స్రవంతిలో కీలకపాత్ర పోషిస్తూ, అపూర్వమైన సేవలను నేటికి ప్రజలకు అందిస్తున్న సంస్థ భారతీయ తపాలా సంస్థని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్, రోటరీ డిస్ట్రిక్ట్ చైర్మన్ జెసి రాజు అన్నారు. బుధవారం ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం పరిధిలో ఉత్తరాలు బట్వాడా చేసి ఇంటింటికి అందించే పోస్ట్ మాన్‌లను సత్కరించే కార్యక్రమాన్ని కారుణ్య సంస్థ నిర్వహించింది. ఈ సందర్భంగా బొబ్బిలి పట్టణ పరిధిలో పోస్ట్ మాన్‌లుగా విధులు నిర్వహిస్తున్న ఎస్ ఆదినారాయణ, ఎం అప్పన్న, డి సంధ్య, సి హెచ్ విజయకుమార్లను కారుణ్య సంస్థ చైర్మన్ జెసి రాజుతో పాటు ప్రధాన కార్యాలయం పోస్ట్ మాస్టర్ జి రాధ, ఎపిఎంఎస్‌బివి స్వాతిలు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.జెసి రాజు మాట్లాడుతూ వ్యక్తులకు, కుటుంబాలకు మధ్య అనుబంధాలు ఏర్పరచేవి తపాలా సేవలేనని అన్నారు. పోస్ట్ మెన్ అందించే సేవలు అమూల్యమైనవని ఫోన్స్ లేనప్పుడు పోస్ట్‌మాన్ తెచ్చే ఉత్తరాల కోసం ఎదురు చూసేవాళ్ళమని గుర్తుచేశారు. ఆనాడు అందరికి సమాచార సాధనం ఉత్తరాలేనని, ఆ ఉత్తరం కనుమరుగై పోయిందని అన్నారు. సాంకేతికతను సంతరించుకుని సేవలను విస్తృతం చేసుకొని నేటికి ప్రజా జీవనంలో కీలక పాత్ర పోషిస్తున్న తపాలా శాఖ, సిబ్బందికి అభినందనలు తెలియచేశారు. కార్యక్రమంలో ఎస్‌బిసిఒ ఇంచార్జ్ సిహెచ్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం సహాయనిధికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-విజయనగరంకోట



చెక్కును అందిస్తున్న గోవింద జ్యూయలర్స్ ప్రతినిధులు

వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి నగరం లోని గోవింద జ్యూయలర్స్ సంస్థ రూ.1 లక్ష విరాళంగా అందజేసింది. ఈ మేరకు చెక్కును స్థానిక ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు బుధవారం కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు అందజేశారు. రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు.

ఉత్సవాలకు బస్సు యజమానుల సంఘం విరాళం

విజయనగర ఉత్సవాల నిర్వహణకోసం జిల్లాకు చెందిన ప్రైవేటు బస్సు యజమానుల సంఘం రూ.3 లక్షలు విరాళంగా అందజేసింది. ఈ మొత్తానికి చెందిన చెక్కును సంఘం ప్రతినిధులు బుధవారం కలెక్టర్ అంబేద్కర్‌కు అందజేశారు. రవాణాశాఖ అధికారులు మురళీకృష్ణ, పాల్గొన్నారు.

కలెక్టర్‌కు పైడితల్లి ఉత్సవ ఆహ్వాన పత్రం అందజేత

ఈనెల 14, 15 తేదీల్లో జరగనున్న పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం ఆహ్వాన పత్రాలను ఆలయ అధికారులు బుధవార కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌కు అందజేశారు. ఆలయ పూజారి వెంకటరావుతో కలసి ఇఒ డివివి ప్రసాదరావు తదితరులు జిల్లా కలెక్టర్‌కు ఆహ్వానపత్రిక అందజేసి ఉత్సవాలకు ఆహ్వానించారు.

గృహ నిర్మాణశాఖపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారులపై కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో రోజుకు రెండిళ్లలో కూడా స్టేజ్ కన్వర్షన్ జరగడం లేదని, లక్ష్యాల సాధనలో వెనుకబడి ఉన్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. పనిచేయని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో గృహ నిర్మాణంపై ఆ శాఖ అధికారులతో తమ ఛాంబర్‌లో బుధవారం సమీక్షించారు. వందరోజుల లక్ష్యాల సాధనపై ప్రశ్నించారు. కేవలం 6శాతం మాత్రమే ప్రగతి కనిపించడంపై అసంతృప్తి చెందారు. బిబిఎల్ స్థాయిలో ఉన్న 8,324 ఇళ్లను ఎట్టిపరిస్థితిలోనూ ఈ నెలాఖరు నాటికి బిఎల్ స్థాయికి తీసుకురావాలని స్పష్టం చేశారు. దీనిపై ఈనెల 16 నుంచి రోజువారీ ప్రగతి నివేదికలను తమకు తెలియజేయాలని పీడీని ఆదేశించారు. గతంలో రోజువారీ స్టేజ్ కన్వర్షన్ లక్ష్యం రోజుకు 5 ఇళ్లుగా ఉండేదని, ప్రస్తుతం మండలానికి రెండిళ్లు మాత్రమే కన్వర్షన్ చేయాలని లక్ష్యం పెట్టినప్పటికీ ముందుకు కదలడం లేదని అన్నారు. లక్ష్య సాధనలో వెనుకబడ్డ ఎఇలపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీ కూర్మినాయుడు, ఇఇ శ్రీనివాసరావు, డిఇలు, పాల్గొన్నారు.

పిఎఫ్ ఖాతా నంబర్లకు ప్రతిపాదనలు చేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

2024 ఆగస్టులోపు డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయులుగా నియమితులైన మున్సిపల్ ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పింఛన్ పొందేందుకు, పిఎఫ్ ఖాతాలు తెరిచేందుకు పిఎఫ్ నెంబర్లకు ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు ప్రతిపాదనలు చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అకాడమిక్ కన్వీనర్ జెసి రాజు అన్నారు. స్థానిక విద్యా వనరుల కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పిఎఫ్ ప్రతిపాదనలు పంపేందుకు ప్రాథమిక ఉపాధ్యాయులు మండల విద్యాశాఖాధికారికి, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ప్రాతిపదికన ఒరిజినల్ దరఖాస్తుతో పాటు జెరాక్స్ ప్రతిని కూడా అందచేయాలన్నారు. జిల్లా గౌరవాధ్యక్షులు బంకురు జోగినాయుడు, ఎపిసిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎల్లయ్య మాట్లాడుతూ తెలుగు, ఇంగ్లీష్, సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలను తగ్గించాలని, ఉత్తర్వులు 117, 84, 85 లను రద్దుచేసి పాఠశాల విద్యను కాపాడాలని కోరారు.

అన్న సమారాధనలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రామభద్రపురం



అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే బేబినాయన

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరిక తోట మధ్య వీధిలో ఏర్పాటు చేసిన దుర్గా భవానీ మాత మండపం వద్ద బుధవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే బేబినాయన పాల్గొని ప్రసాదాలు వడ్డించారు. ఉత్సవాల్లో భాగంగా 7వ రోజున దుర్గామాతను సరస్వతీ దేవిగా అలంకరించి విద్యార్థులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ ఇటీవల ప్రజల్లో భక్తి భావం, దాతృత్వం పెరిగిందని దీని వల్ల గ్రామాల్లో ఇటువంటి మంచి కార్యక్రమాలు జరగడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, జనసేన నాయకులు, భవానీ మాల దారులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై యువతకు అవగాహన

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం వల్లంపూడి ఎస్ఐ బి. దేవి యువతకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు ప్రతిరోజు పిల్లల ప్రవర్తన పై నిఘా ఉంచాలన్నారు. ఉద్యోగాల పేరుతో మోసాలకు గురై ఆర్థిక ఇబ్బందులు పడొద్దన్నారు. సెల్‌ఫోన్లలో వచ్చే ఫోక్ ఫోన్ కాల్స్‌ను నమ్మొద్దని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

గర్భిణులకు వైద్య సేవలు

ప్రజాశక్తి - వేపాడ

గర్భిణీని తనిఖీ చేస్తున్న డాక్టర్ ధరణి

స్థానిక పిహెచ్‌సిలో బుధవారం ప్రధానమంత్రి సురక్ష ఆరోగ్య వైద్య సేవలు నిర్వహించారు. ఈ వైద్య సేవలో 38 మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలను వైద్యాధికారి డాక్టర్ ధరణి నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులకు బానాది సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో భోజనం ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది, సిహెచ్‌ఒ ఆంజనేయులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గడ్డిమందు తాగి మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - గంట్యాడ

మండలంలోని పెదవేమలి గ్రామానికి చెందిన బూడిదల కుమారి (25) గడ్డి మందు తాగి బుధవారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన వివరాల ప్రకారం.. భర్తతో గొడవపడి కుమారి మంగళవారం పొలంలోకి వెళ్లి గడ్డి మందు తాగి స్పృహ కోల్పోయింది. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు జిల్లా కేంద్ర ఆసుపత్రికి ఆమెను తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఎస్ఐ సాయి కృష్ణ, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు.

జూదగాళ్లపై కేసు నమోదు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

పట్టణంలోని శివాలయం వీధిలో నూకాలమ్మ గుడి వద్ద పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడి చేసి నలుగురు పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేశామని ఎస్ఐ గంగరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పేకాట ఆడుతున్న వ్యక్తులకు పోలీసులు వస్తున్నారన్న సమాచారం తెలియడంతో పారిపోయారని వెంబడించి పట్టుకుని వారి వద్దనుండి రూ. 11,200లు నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ దాడిలో మరో ఎస్ఐ భాస్కరరావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యంతో వ్యాపారి అరెస్టు

ప్రజాశక్తి - బొబ్బిలి

అక్రమ మద్యంతో వ్యాపారి వి.తవిటినాయుడును అరెస్టు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్ కుమార్ చెప్పారు. దంగరాయపురం గ్రామానికి చెందిన తవిటినాయుడు అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ ఆర్.రమేష్, సిబ్బందితో బైపాస్ రోడ్డులో ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో పట్టుకుని 60మద్యం సీసాలను సీజ్ చేసి అరెస్టు చేసినట్లు చెప్పారు. అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, విజయనగరం

Creditor I.P.No.16/2024

Between:
Katralapalli Nagamani
...Petitioner
And
R 1) Jami Mani , W/o.late Eswar Rao, Hindu, aged 36 years, Housewife & Property D.No.2-93, Sanjeevayya Nagar, Gajularega Post, Vizianagaram, Vizianagaram JCJC.
R 2) Jami Ramesh, S/o.Late Eswara Rao, Hindu, Aged 20 years, Student , D.No.2-93, Sanjeevayya Nagar, Gajularega Post, Vizianagaram, Vizianagaram JCJC.
...1,2, Respondents

పై గ్రంధములో 1వ ప్రతివాది, 2వ ప్రతివాదికి వ్రాసి ఇచ్చిన దస్తావేజు నెం. **4510/2024** ది. **26-04-2024** SRO,విజయనగరం సబ్ రిజిష్టర్ వారి ఆఫీసులో రిజిష్టరు కాబడిన సదరు దస్తావేజు చెల్లదని మరియు 1వ ప్రతివాదిని ఇన్సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని పిటీషనర్ పై కోర్టులో గ్రంధము ధాఖలు చేసి ఉన్నారు. కావున ఎవరికైనా పై గ్రంధములో ఎటువంటి అభ్యంతరములు ఉన్న ఎడల ది. **17-10-2024** తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం **10.30** గంIIలకు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనిచో కోర్టు చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకొందురు.

(By Order of Court)

S.V.S. కృష్ణప్రసాద్
N.S. గణేష్
అడ్వకేట్స్ ,విజయనగరం